సాక్షి
విశాఖపట్నం
గురువారం । 17 । ఆగస్టు । 2023



**ఉచిత న్యాయం.. ప్రజల హక్కు**

ఉచిత న్యాయ సహాయం పొందడం ప్రజల హక్కు అని జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ అన్నారు. 8లో



**లోకో షెడ్‌లో తనిఖీలు**

వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ బుధవారం ఎలక్ట్రికల్ లోకో షెడ్‌లో తనిఖీలు చేశారు. 8లో



**పలు రైళ్ల దారి మళ్లింపు**

ఈస్టర్న్ రైల్వే హౌరా డివిజన్ పరిధిలో పలు రైళ్లు దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. 8లో

## న్యూస్‌రీల్

### రేంజ్ పరిధిలో 17 మంది ఎస్‌ఐలకు పదోన్నతి



దొండపర్తి : విశాఖ రేంజ్ పరిధిలో 17 మంది ఎస్‌ఐలకు ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు డీఐజీ హరికృష్ణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో విశాఖ నగరం నుంచి ఆరుగురు, అనకాపల్లి నుంచి నలుగురు, విజయనగరంలో ఇద్దరు, శ్రీకాకుళంలో ఒకరు, ఇంటెలిజెన్స్, సీఐడీలో ఇద్దరేసి చొప్పున ఉన్నారు. విశాఖలో ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న సనపల ఖగేశ్వరరావు, రెయ్యి సోమేశ్వరరావు, చొల్లంగి వెంకటరావు, ఆదారి సంతోష్‌కుమార్, చింతా వాసునాయుడు, మీసాల చంద్రమౌళిలకు ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి లభించింది. అలాగే అనకాపల్లి జిల్లాకు చెందిన జి.దివాకర్ వాయునందనరావు, వి.చక్రధరరావు, నర్సీపట్నం టౌన్‌లో ఎస్‌ఐగా ఉన్న గొల్లంగి గోవిందరావు, బుచ్చయ్యపేట స్టేషన్ ఎస్‌ఐ కంచరపు కుమారస్వామిలకు ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి దక్కింది. అదే విధంగా ఇంటెలిజెన్స్ విభాగంలో ఉన్న సూర అమ్మినాయుడు, గింద్రి దాలిబాబు, సీఐడీలో ఉన్న సానబోయిన శ్రీనివాస్, సవరపు రమేష్‌లకు ఇన్‌స్పెక్టర్లుగా ప్రమోషన్ లభించింది.

### ప్రతిష్టాత్మకమైన పతకాలు పోలీస్ శాఖకు గర్వకారణం



సీపీ త్రివిక్రమ్ వర్మకు పతకాన్ని చూపిస్తున్న ఏడీసీపీ(ఏఆర్) సుబ్రహ్మణ్యం, ఏసీపీ(సీసీఎస్) వెంకటరావు

దొండపర్తి: పోలీస్ శాఖలో సుదీర్ఘమైన సర్వీస్ చేస్తూ ఎటువంటి రిమార్క్స్ లేకుండా ప్రతిష్టాత్మక పతకాలు సాధించడం నగర పోలీస్ శాఖకు గర్వకారణమని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పతకాలు అందుకున్న ఏడీసీపీ(ఏఆర్) కె.సుబ్రహ్మణ్యం, ఏసీపీ(సీసీఎస్) ఎ.వెంకటరావు బుధవారం సీపీని తన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పతకాలను చూపించారు. పోలీస్ శాఖలో అంకితభావంతో విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏడీసీపీ(ఏఆర్) కె.సుబ్రహ్మణ్యం సీఎం చేతుల మీదుగా ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్నారు. అలాగే విధి నిర్వహణలో చేసిన విశిష్ట సేవలు, చూపిన ధైర్యసాహసాలకు ఏసీపీ(సీసీఎస్) ఎ.వెంకటరావు రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టిన అసాధారణ్ ఆసూచన కుశలత పథక్-2022ను సీఎం చేతుల మీదుగా దక్కించుకున్నారు. ఈ సందర్భంగా సీపీ త్రివిక్రమ్ వర్మ వీరిని అభినందించారు.

### బెంగాల్ గవర్నర్‌తో ఈఎన్‌సీ ఫ్లాగ్ ఆఫీసర్ భేటీ



బెంగాల్ గవర్నర్ ఆనంద బోస్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈఎన్‌సీ ఫ్లాగ్ ఆఫీసర్ రాజేష్

సింధియా: పశ్చిమ బెంగాల్ గవర్నర్ డాక్టర్ సీవీ ఆనంద బోస్‌ను తూర్పు నావికాదళ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తూర్పు నావికాదళ ప్రధాన కార్యాచరణ అంశాలను ఆయనకు వివరించారు. అలాగే లెఫ్టినెంట్ జనరల్ ఆర్‌పీ కలితను మర్యాదపూర్వకంగా కలిసి.. ప్రధాన కార్యాచరణ కార్యాకలాపాలు, ఉమ్మడి, పరస్పర చర్యలకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

### పీజీ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాల గడువు పెంపు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో పీజీ డిప్లమో, డిప్లమో కోర్సుల్లో ప్రవేశాల గడువును ఈనెల 28 తేదీ వరకు పొడిగించినట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంకాలం నిర్వహించే ఏడాది వ్యవధి గల పీజీ డిప్లమో ఇన్ యోగా.. డిప్లమో కోర్సులైన లలిత సంగీతం, ఆధ్యాత్మిక సంగీతం, కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం, తాళవాయిద్యాలలో మృదంగం, ఘటం, కంజీర.. ఆరు నెలల వ్యవధి గల డిప్లమా కోర్సుల్లో యోగా, ఫ్రెంచ్, జర్మన్, జపనీస్, ఫొటోగ్రఫీ, కొరియన్ కోర్సులకు ప్రవేశాలు కల్పిస్తారు. ఆసక్తి గల వారు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తులను పెదవాల్తేరులోని ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ నెల 29న ఉదయం 10 గంటలకు పీజీ డిప్లమో కోర్సులకు, మధ్యాహ్నం 2 గంటలకు డిప్లమో కోర్సులకు ప్రవేశాలు కల్పిస్తారు.

## ● అట్టహాసంగా ఏపీఎల్ ఆరంభం




ఆంధ్ర ప్రీమియర్ లీగ్-2 సీజన్ అట్టహాసంగా ఆరంభమైంది. ఆరు జట్ల ఫ్రాంచైజీ యజమానులు, కెప్టెన్లు ఫొటో సెషన్‌తో మెరవగా.. హీరోయిన్ శ్రీలీల ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తొలి రోజు మ్యాచ్‌లో బెజవాడ టైగర్స్ జట్టుపై కోస్టల్ రైడర్స్ విజయం సాధించి శుభారంభం చేసింది.

# ఫీడ్‌బ్యాక్‌లో విశాఖ 1 నంబర్



- బుధవారం నాటికి 6,49,237 మంది అభిప్రాయాల నమోదు
- 5,77,670 మంది ఫీడ్‌బ్యాక్‌తో తర్వాత స్థానంలో ఇండోర్
- ఈ నెల 31 వరకు గడువు పెంపు

డాబాగార్డెన్స్: స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో జీవీఎంసీ దూసుకుపోతోంది. సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌లో ప్రస్తుతానికి దేశంలో మొదటి స్థానంలో ఉంది. ఇదే స్థానంలో కొనసాగాలంటే నగర పౌరుల సహకారం ముఖ్యం. ప్రజలు తమ అభిప్రాయాలు నమోదు చేయడానికి ఈ నెల 16వ తేదీతో గడువు ముగియగా.. మరింత మందికి అవకాశం కల్పించేందుకు ఈ నెల 31 వరకు గడువు పొడిగించారు. స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో ఈ నెల 15 నాటికి విశాఖకు చెందిన 6,49,014 మంది ఫీడ్‌బ్యాక్ ఇవ్వగా.. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు మరో 223 మంది తమ అభిప్రాయాలను నమోదు చేశారు. దీంతో ఈ సంఖ్య 6,49,237కు చేరుకుంది. ఇండోర్ 5,77,670 మంది, భోపాల్ 5,36,331 మంది ఫీడ్‌బ్యాక్‌తో రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి.

**ఫీడ్ బ్యాక్ ఇవ్వండి ఇలా..**

స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో విశాఖను ప్రథమ స్థానంలో నిలిపేందుకు https://vfcity-prod.sbmurban.org, voteforyourcity2023(యాప్), స్వచ్ఛతా యాప్, voteforyourcity పోర్టల్, https://www.mygov.in, https://sbmurban.orgను సందర్శించి.. నగర పౌరులు తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చు.

# అభివృద్ధి పరవళ్లు

- జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా మౌలిక సదుపాయాల కల్పన
- గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రాధాన్యత పనులకు పెద్ద పీట
- జిల్లాలో 710 పనుల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్
- రూ.54.10 కోట్లతో పనులకు శ్రీకారం
- 287 పనులు పూర్తి.. పురోగతిలో 553



గంధవరంలో పైప్ కల్వర్టు పనులు




గంగమ్మపేటలో కైలాసవాటిక షెడ్ ఏర్పాటు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన ప్రాధాన్యత పనులు జిల్లాలో జోరందుకున్నాయి. మొత్తం 743 పనులు గుర్తించగా.. ప్రభుత్వం 710 పనులకు రూ.54.10 కోట్లు మంజూరు చేసింది. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు అధికారులతో కలెక్టర్ మల్లికార్జున సమీక్ష నిర్వహిస్తున్నారు. పనుల వేగవంతం అయ్యేలా సూచనలిస్తున్నారు.

**ప్రజలతో మమేకం.. సమస్యల గుర్తింపు**

ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలు తెలుసుకోవడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు సచివాలయాల పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు విన్నారు. వారు సూచించిన పనుల్లో ప్రాధాన్యతను గుర్తించి వాటిని ప్రభుత్వానికి నివేదించారు. జిల్లాలో మొత్తం 743 అత్యంత ప్రాధాన్యత గల పనులను గుర్తించగా.. ఇందులో రూ.54.10 కోట్ల విలువైన 710 పనులకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. ఇప్పటి వరకూ 287 పనులు పూర్తి కాగా.. మరో 553 పనులు పురోగతిలో ఉన్నాయి.

**మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పనులే అధికం**

విశాఖ జిల్లాలో సింహభాగం జీవీఎంసీ పరిధిలో ఉంది. దీంతో ప్రాధాన్యత పనులు ఎక్కువగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించినవే ఉన్నాయి. ఇప్పటి వరకూ జీవీఎంసీ పరిధిలో 582 పనులు గుర్తించగా.. 425 పనులు ప్రారంభించగా వాటిలో 245 పూర్తయ్యాయి. గ్రామీణ నీటి సరఫరా విభాగానికి సంబంధించి 91 పనులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 15 పనులు పూర్తి చేయగా.. 74 పురోగతిలో ఉన్నాయి. వీటితో పాటు పంచాయతీరాజ్, ఏపీఈపీడీసీఎల్, ఆర్ అండ్ బీ శాఖల పనులు జోరుగా కొనసాగుతున్నాయి.

**చర్చించి.. నివేదికలు రూపొందించి..**

ఆయా నియోజకవర్గంలో ప్రజలు తెలిపిన సమస్యలపై ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులతో చర్చించి నివేదికలు రూపొందించారు. ఆయా ప్రాంతాల్లో ముఖ్యమైన పనులేవి..? వాటిలో ఏ పనులు ముందు మొదలుపెట్టాలో నిర్ణయించారు. దాని ప్రకారం ఆయా ప్రాంతాల్లో పనులు మొదలుపెట్టారు. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించి వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

**నియోజకవర్గాల వారీగా.. ప్రాధాన్యతా పనుల వివరాల్ని పరిశీలిస్తే...**

| నియోజకవర్గం | గుర్తించిన పనులు | మంజూరైన పనులు | అంచనా (రూ.కోట్లలో) | మొదలైన పనులు | పూర్తయిన పనులు |
|---|---|---|---|---|---|
| భీమిలి | 221 | 207 | 12.77 | 150 | 51 |
| విశాఖ తూర్పు | 108 | 103 | 7.80 | 91 | 55 |
| పెందుర్తి మండలం | 93 | 85 | 4.32 | 43 | 14 |
| విశాఖ ఉత్తరం | 97 | 95 | 10.58 | 91 | 55 |
| గాజువాక | 51 | 51 | 5.31 | 49 | 46 |
| విశాఖ పశ్చిమ | 87 | 78 | 5.93 | 51 | 37 |
| విశాఖ దక్షిణ | 91 | 91 | 7.39 | 91 | 55 |

# థ్యాంక్యూ సీఎం జగన్ సార్

**కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ల సంబరాలు**



థ్యాంక్యూ సీఎం జగన్ సార్ అంటూ నినాదాలు చేస్తున్న కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లు

మద్దిలపాలెం (విశాఖ తూర్పు): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసును రెగ్యులర్ చేస్తూ, వారి జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడుతూ థ్యాంక్యూ సీఎం జగన్ సార్ అంటూ కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లు నీరాజనాలు పలికారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ జీవోపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతకం చేయడంతో కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లు మద్దిలపాలెంలో బుధవారం సంబరాలు చేసుకున్నారు. సీఎం జగన్ చిత్రపటాన్ని పట్టుకుని థ్యాంక్యూ సీఎం జగన్ సార్ అంటూ నినాదాలు చేశారు. మాట తప్పని, మడమ తిప్పని నేతగా కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాల హృదయాల్లో సీఎం జగన్ సుస్థిరంగా నిలిచిపోతారని ఆనందం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం 60 రోజుల వ్యవధిలో జీవోపై సంతకం చేశారని కొనియాడారు. జై జగన్... జైజై జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు.

## నేటి నుంచి కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణం పూజలు



డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శ్రావణ మాసం పురస్కరించుకొని ఈ నెల 17 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు ప్రతి రోజూ శ్రావణలక్ష్మి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. గురువారం ఉదయం 8.45 గంటలకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి సామూహిక ప్రత్యేక పూజలను ప్రారంభించనున్నారని ఆలయ ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు, శ్రావణ మాసం ప్రతి శుక్రవారం ఉదయం 8 నుంచి 9, 9.30 నుంచి 10.30 గంటల వరకు పూజలు జరుగుతాయన్నారు. పూజలో పాల్గొనే దంపతులు రూ.400 చెల్లించాలని తెలిపారు.

## 18 నుంచి జనరల్ యోగా తరగతులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి జనరల్ యోగా, స్థూలకాయ నివారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు సెంటర్ సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు భానుకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు సాధారణ యోగా తరగతులు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు స్థూలకాయ నివారణ యోగా తరగతులను నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు 94944 01919, 9398 019922 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం

**గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి దివాన్ ఆదేశం**



గృహ నిర్మాణ ప్రగతిపై సమీక్షిస్తున్న హౌసింగ్ స్పెషల్ సెక్రటరీ దివాన్

మహారాణిపేట: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి.ఎం.దివాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జిల్లాలో గృహ నిర్మాణ ప్రగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్, సిమెంట్, ఇసుక తదితర నిర్మాణ సామగ్రిని అందుబాటులో ఉంచాలని, సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ప్రగతి సాధించాలన్నారు. లేఅవుట్లలో ఇంకుడు గుంతలు నిర్మించాలని ఆదేశించారు. లబ్ధిదారులందరికీ బ్యాంకు ఖాతాలు తెరవాలని సూచించారు. ప్రతీ జగనన్న కాలనీలో ముఖ ద్వారాన్ని త్వరితగతిన నిర్మించాలన్నారు. లే అవుట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించి డ్రైనేజీ, రోడ్లు, నీటి సదుపాయం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం కాంట్రాక్టర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బురద జల్లడానికే..!

- పవన్ ఎర్రమట్టి దిబ్బల పర్యటన
- స్థానికుల నుంచి కరువైన స్పందన



ఎర్రమట్టి దిబ్బల ప్రాంతంలో పవన్ కల్యాణ్

సాక్షి, విశాఖపట్నం/తగరపువలస: ఎర్రమట్టి దిబ్బల వ్యవహారంలో ప్రభుత్వంపై బురద జల్లడానికే జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారు. ఎర్రమట్టి దిబ్బలకు దూరంగా ఉన్న ప్రాంతంలోని భూమిని వీఎంఆర్‌డీఏ చదును చేయిస్తోంది. దీనివల్ల ఎర్రమట్టి దిబ్బలకు ముస్ముందు ముప్పు వాటిల్లుతుందంటూ పవన్ అసత్య ఆరోపణలు చేస్తున్నారు. వాస్తవానికి కొత్తవలస గ్రామంలోని సర్వే నంబరు 75, 86, 87ల్లో ఉన్న ఈ భూమిని గతంలో భూమి లేని నిరుపేదల కోటాలో 18 మంది రైతులు కేటాయించారు. వీరి నుంచి ఈ భూమిని ల్యాండ్ పూలింగ్ కింద 2020లో వీఎంఆర్డీఏ సేకరించి అభివృద్ధి చేస్తోంది. ఎర్రమట్టి దిబ్బల బఫర్ జోన్‌కు ఆవల 45 మీటర్ల దూరంలో ఈ పనులు చేపట్టింది. ఈ పనుల వల్ల ఎర్రమట్టి దిబ్బలకు ఎలాంటి ప్రమాదం ఉండబోదని అధికారులు కూడా ఇప్పటికే స్పష్టం చేశారు. అయినప్పటికీ రాజకీయ లబ్ధికోసం పవన్ ఎర్రమట్టి దిబ్బల అంశాన్ని ఎంచుకున్నారు. ఇందులో భాగంగా వారాహి యాత్రలో ఉన్న ఆయన బుధవారం సాయంత్రం కొంతమంది పార్టీ శ్రేణులను వెంటబెట్టుకుని జేవీ అగ్రహారం పరిధిలోని ఎర్రమట్టి దిబ్బల ప్రాంతానికి పరిశీలనకు వెళ్లారు. అయితే ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్ప ఆ పరిసర గ్రామాల వారు రాలేదు. వీఎంఆర్డీఏ స్థలాన్ని అక్రమంగా చదును చేయిస్తోందని గాని, దానివల్ల ఎర్రమట్టి దిబ్బలకు ముప్పు వాటిల్లుతుందని గాని ఎవరూ ఆయనకు ఫిర్యాదు చేయలేదు. అభిమానులే జై పవన్ అంటూ నినాదాలు చేశారు. నిబంధనలకనుగుణంగా సాక్షాత్తూ ప్రభుత్వ సంస్థ వీఎంఆర్డీఏ స్థలాన్ని అభివృద్ధి చేస్తుంటే వచ్చిన ఇబ్బంది ఏమిటంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎర్రమట్టి దిబ్బల గురించి మీడియాతో మాట్లాడుతున్నప్పుడు వచ్చిన సందేహాలను ఆయన పక్కనే ఉన్న నాదెండ్ల మనోహర్‌ను, పార్టీ నాయకులను చెవిలో అడిగి నివృత్తి చేసుకున్నారు. కాగా ఎర్రమట్టి దిబ్బల విస్తీర్ణం అధికారిక లెక్కల ప్రకారం 262.92 ఎకరాలు కాగా, పవన్.. దానికి 292 ఎకరాలుగా పేర్కొన్నారు. వీటిని వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అన్యాక్రాంతం చేశారని తప్పుడు ఆరోపణలు చేశారు. మీడియాతో దాదాపు ఐదు నిమిషాల సేపు క్లుప్తంగా మాట్లాడి పవన్ అక్కడ నుంచి నిష్క్రమించారు.

# ఆర్థిక వ్యవస్థలో బ్యాంకింగ్ పాత్ర కీలకం

**ఎస్‌బీఐ చైర్మన్ దినేష్‌కుమార్**




బస్సు ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ చైర్మన్ దినేష్ కుమార్



కలెక్టర్ మల్లికార్జునకు చెక్ అందజేస్తున్న ఎస్‌బీఐ చైర్మన్ దినేష్‌కుమార్

ఆనందపురం: భారత ఆర్థిక వ్యవస్థలో బ్యాంకింగ్ పాత్ర అత్యంత కీలకంగా మారిందని ఎస్‌బీఐ చైర్మన్ దినేష్ కుమార్ ఖరా అన్నారు. గంభీరంలోని ఐఐఎంను బుధవారం ఆయన సందర్శించారు. ఇక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ శాఖను ప్రారంభించారు. సీఎస్సార్‌లో భాగంగా ఐఐఎంకు బస్సును బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార నిర్వహణ కోర్సులు చదువుతున్న విద్యార్థులు ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి నూతన ఒరవడులను సృష్టించాలన్నారు. సంపద సృష్టి కోసం తమ మేధస్సును పదును పెట్టాలన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను మెరుగు పరచడానికి బ్యాంకులు తమ వంతు పాత్రను పోషిస్తున్నాయని చెప్పారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆగస్టులో రాష్ట్రం అంతటా 51 వేల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

**సామాజిక కార్యక్రమాల్లో ఎస్‌బీఐ ముందంజ**

మధురవాడ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకింగ్ సేవలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతోందని ఎస్‌బీఐ చైర్మన్ దినేష్ కుమార్ ఖరా చెప్పారు. బీచ్‌రోడ్డులోని రాడిషన్ బ్లూ రిసార్ట్స్‌లో బుధవారం ఎస్‌బీఐ మేనేజర్లతో ఆయన సమావేశమయ్యారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్సార్) కింద పలు సంస్థలకు నిధులు అందజేశారు.

- కేజీహెచ్‌లో పిక్చర్ ఆర్కైవింగ్, కమ్యూనికేషన్ సిస్టమ్(పీఏసీఎస్) ఏర్పాటుకు సంబంధించి కలెక్టర్ మల్లికార్జునకు రూ.40 లక్షల చెక్కును అందజేశారు.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీలో ఎక్స్‌ఆర్‌డీ అనలిటికల్ ల్యాబ్ ఏర్పాటు కోసం రూ.3.94 కోట్ల చెక్కును వర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్‌కు అందించారు.
- రిమోట్ కంట్రోల్డ్ లైఫ్ సేవింగ్ కోసం రూ. 35.92 లక్షల విలువ గల ఆరు బోయ్ యూనిట్లు, రూ.32.71 లక్షల విలువ చేసే 42 సీట్ల స్టార్‌బస్‌ను కోస్ట్ గార్డ్‌కు అందజేశారు. డీఐజీ యోగిందర్ ఢాకాతో కలిసి బస్సును ప్రారంభించారు.
- సాగర్‌నగర్‌లో జరిగిన పీఎం స్వానిధి మెగా క్యాంప్‌లో పాల్గొని.. 300 మంది మహిళలకు రుణాల చెక్‌లు అందించారు.

ఎస్‌బీఐ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ నవీన్ చంద్ర, జనరల్ మేనేజర్ హేమంత్ కుమార్, డీజీఎం పంకజ్ కుమార్, కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.శివానంద్, తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రమట్టి దిబ్బలు కబ్జా అని నిరూపిస్తే దేనికైనా సిద్ధం

**పవన్‌కు మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి సవాల్**



సింహాచలం: ఎర్రమట్టి దిబ్బల్లో వైఎస్సార్ సీపీ నాయకులెవరైనా ఒక్క గజం స్థలం కబ్జా చేసినట్టు పవన్ కల్యాణ్ నిరూపిస్తే.. దేనికైనా సిద్ధమని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సవాల్ విసిరారు. అడవివరంలో బుధవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ తన తీరును మార్చుకోవాలని హెచ్చరించారు. ప్రకృతి విశాఖకి ఇచ్చిన గొప్ప సంపద ఎర్రమట్టి దిబ్బలని, వాటి ప్రాముఖ్యత తమకు తెలుసన్నారు. ఎర్రమట్టి దిబ్బలజోలికెళ్తే కేంద్ర ప్రభుత్వం కూడా ఊరుకోదన్నారు. విశాఖ అంటే చాలా ప్రేమని చెప్పే పవన్ కల్యాణ్.. విశాఖ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతినే విధంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదే పదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బురదజల్లుతున్నారని మండిపడ్డారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అన్యాయాలు, అక్రమాలు గుర్తుకురాలేదా అని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ రియల్ ఎస్టేట్స్ గురించి మాట్లాడుతున్నారని.. ఇందులో ప్రభుత్వానికి సంబంధం ఏమిటన్నారు. హైదరాబాద్‌లో అక్కడి ప్రభుత్వమే ప్రభుత్వ భూములను వేలం వేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎప్పుడైనా ప్రభుత్వ భూములను వేలం వేసిందా అని ప్రశ్నించారు. రుషికొండపై గతంలో హరిత రిసార్ట్స్ ఉండేవన్న విషయం వాస్తవమా.. కాదా అన్నారు. పవన్ ఒక్కరే పర్యావరణ ప్రేమికుడిలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకి ప్రతిదీ రాజకీయం చేయడమే తెలుసని.. ఆయన కనుసన్నల్లోనే పవన్ మాట్లాడుతున్నారని ఆరోపించారు. సుమారు రూ.రెండు లక్షల కోట్ల సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపిస్తారని, భీమిలిలో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు.

## పారదర్శకంగా ఓటర్ల జాబితా



మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేయడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని.. ఇందులో ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు జేసీ కె.ఎస్.విశ్వనాథన్ కోరారు. తన చాంబర్‌లో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధుల దృష్టికి వచ్చిన సమస్యలు తెలియజేస్తే.. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పలు రైళ్ల దారి మళ్లింపు

**తాటిచెట్లపాలెం:** ఈస్టన్ రైల్వే హౌరా డివిజన్ పరిధిలో జరుగుతున్న ప్రి నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ డీసీఎం త్రిపాఠి తెలిపారు.

- ఈ నెల 17, 19, 22, 24, 26, 29 తేదీల్లో డిబ్రూఘడ్- కన్యాకుమారి (22504) వివేక్ ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా న్యూ ఫరక్కా, అజీమన్‌గంజ్, కత్వ, బందేల్, హౌరా, అండుల్ మీదుగా నడుస్తుంది.
- ఈ నెల 16, 17, 19, 21, 23, 24, 26, 28 తేదీల్లో కన్యాకుమారి–డిబ్రూఘడ్(22503) వివేక్ ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా అండుల్, హౌరా, కత్వ, బందేల్, అజీమన్‌గంజ్, న్యూ ఫరక్కా మీదుగా నడుస్తుంది.
- ఈ నెల 20న విశాఖపట్నం–రంగపర నార్త్ (08562) జనసాధారణ్ ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా అండుల్, హౌరా, కత్వ, బందేల్, అజీమన్‌గంజ్, న్యూ ఫరక్కా మీదుగా నడుస్తుంది.
- ఈ నెల 22న రంగపరనార్త్–విశాఖపట్నం (08561) జనసాధారణ్ ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా న్యూ ఫరక్కా, అజీమన్‌గంజ్, కత్వ, బందేల్, హౌరా, అండుల్ మీదుగా నడుస్తుంది.

**ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ప్రయోగాత్మక హాల్ట్**

భువనేశ్వర్–బెంగళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 20వ తేదీ నుంచి కలుపరఘాట్ స్టేషన్‌లో ప్రయోగాత్మకంగా తాత్కాలిక హాల్ట్ ఇచ్చారు. భువనేశ్వర్–బెంగళూరు (18463) ఎక్స్‌ప్రెస్ కలుపరఘాట్‌కు ఉదయం 6.36 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి 6.38 గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో బెంగళూరు–భువనేశ్వర్(18464) ఎక్స్‌ప్రెస్ కలుపర్‌ఘాట్‌కు సాయంత్రం 5.23 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి 5.25గటలకు బయల్దేరుతుంది.

**పలు రైళ్ల రీషెడ్యూల్**

పలు లింక్ రైళ్లు ఆలస్యంగా చేరుకోవడం వల్ల ఆయా స్టేషన్ల నుంచి పలు రైళ్లు ఆలస్యంగా బయల్దేరినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

- బెంగళూరులో బుధవారం ఉదయం 10.35 గంటలకు బయల్దేరాల్సిన బెంగళూరు–హౌరా(12864) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు 5.30 గంటలు ఆలస్యంగా సాయంత్రం 4 గంటలకు బయల్దేరింది.
- షాలిమర్‌లో బుధవారం మధ్యాహ్నం 12.20 గంటలకు బయల్దేరాల్సిన షాలిమర్–సికింద్రాబాద్ (22849) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు 2 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 2.20 గంటలకు బయల్దేరింది.

# యువ క్రికెటర్లకు చక్కటి అవకాశం ఏపీఎల్

- ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు శరత్‌చంద్రరెడ్డి
- అట్టహాసంగా ఆంధ్ర ప్రీమియర్ లీగ్–2 ఆరంభం




విజేత ట్రోఫీని వేదిక వద్దకు తీసుకువస్తున్న రషీద్ / రన్నరప్ ట్రోఫీని తీసుకువస్తున్న రికీబుయ్



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్



పోటీలను ప్రారంభిస్తున్న హీరోయిన్ శ్రీలీల

**విశాఖ స్పోర్ట్స్:** ఆంధ్రా క్రికెటర్లు ప్రతిభను ప్రదర్శించేందుకే ఏపీఎల్ ప్లాట్‌ఫాం కానుందని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు శరత్‌చంద్రరెడ్డి పేర్కొన్నారు. బీసీసీఐ సహకారంతో ఆంధ్ర ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) రెండో సీజన్‌ను బుధవారం వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర తరపున పలు కేటగిరిల్లో యువ క్రీడాకారులు ఆడుతున్నారని.. వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా ప్రోత్సహించడమే ఏపీఎల్ ముఖ్య ఉద్దేశమన్నారు. రాష్ట్ర ఐటీ మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ అక్టోబర్ 2 నుంచి ఏపీలోని ప్రతీ గ్రామ, వార్డులో ఔత్సాహిక ఆటగాళ్లను ప్రోత్సహించే విధంగా 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారన్నారు. ఈ పోటీల్లో 15 వేలకు పైగా జట్లు ఎంపిక చేసిన క్రీడల్లో పోటీపడనున్నాయన్నారు. తొలుత అతిథిగా హాజరైన సినీ నటి శ్రీలీల ఆయా జట్ల ఫ్రాంచైజీ అధినేతలు, కెప్టెన్‌లతో కలిసి ఫొటోలకు ఫోజులిచ్చారు. ఈ కార్యక్రమంలో వీడీసీఏ అధ్యక్షుడు, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ మేయర్ హరివెంకటకుమారి, ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ఫెర్రర్, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథరెడ్డి, ఉపాధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కోస్టల్ రైడర్స్–బెజవాడ టైగర్స్ జట్ల మధ్య పోరుతో ఈ సీజన్ ఆరంభమైంది. శరత్ చంద్రరెడ్డి టాస్ వేశారు. బెజవాడ టైగర్స్ జట్టుపై కోస్టల్ రైడర్స్ 12 పరుగుల తేడాతో విజయం సాధించి శుభారంభం చేసింది.



వికెట్ కోసం అప్పీల్ చేస్తున్న బెజవాడ టైగర్స్

**అభిమానుల సందడి**

ఏపీఎల్–2 సీజన్ అట్టహాసంగా ప్రారంభమైంది. తొలుత విజేతలకు అందించే ట్రోఫీతో ఆరుజట్ల ఫ్రాంచైజీ యజమానులు, కెప్టెన్లు ఫొటో సెషన్ నిర్వహించారు. సినీ నటి శ్రీలీల ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఐపీఎల్ తరహాలో చీర్ గాళ్స్ సైతం బౌండరీలు, వికెట్లు పడినప్పుడు అభిమానులను ఉత్సాహపరిచారు. స్టేడియంలో అభిమానుల సందడి నెలకొంది.



చీర్ గర్ల్స్ సందడి



క్రీడాభిమానుల కేరింతలు

# బడుగుల ఆశాజ్యోతి గౌతు లచ్చన్న



నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు

**డాబాగార్డెన్స్:** బడుగుల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న అని డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అన్నారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా బుధవారం జడ్జి కోర్టు సమీపంలోని ఆయన విగ్రహానికి కోలా గురువులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ వెనుకబడిన కులాలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చిన నాయకుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. అనంతరం పలువురు గురువులను సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం, జాతీయ బీసీ సంఘం ప్రతినిధి కొణతాల శ్రీనివాస్, అయ్యారక సంక్షేమ సంఘం డైరెక్టర్ కె.రామన్నపాత్రుడు, బీసీ సంఘం నాయకుడు పితాని ప్రసాద్, బీసీ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు పిల్లా నూకరాజు, బి.త్రినాథ్, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ రాయుడు శ్రీనివాసరావు, గౌతు లచ్చన్న సంఘం ఉపాధ్యక్షుడు కేశన వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ వివేకానంద, గుత్తుల మధు తదితరులు పాల్గొన్నారు.

# అంతర ఇన్‌స్టిట్యూట్ టీటీ పోటీల ప్రారంభం

**విశాఖ స్పోర్ట్స్:** అంతర ఇన్‌స్టిట్యూట్ టీటీ టోర్నీ బుధవారం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ప్రారంభమైంది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఇండియా ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తుండగా 16 మెన్, వుమెన్ జట్లు పాల్గొంటున్నాయి. టీమ్ ఈవెంట్స్ తొలి మూడు రోజుల అనంతరం ఈనెల 19 నుంచి వ్యక్తిగత ఈవెంట్స్ ప్రారంభం కానున్నాయి. పోటీల ప్రారంభ కార్యక్రమానికి కలెక్టర్ ఎ.మల్లికార్జున హాజరై క్రీడాకారుల వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఏఏఐ ప్రతినిధులు శ్రీనివాస్, కమలేష్ మెహతా, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన ఇంజినీరింగ్ ఆప్షన్ల గడువు

**23న సీట్ల కేటాయింపు**



పాలిటెక్నిక్ కాలేజీలో ఆప్షన్ల ఎంపికలో విద్యార్థికి సహకరిస్తున్న అధ్యాపకుడు

**మురళీనగర్:** ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి వెబ్ ఆప్షన్ల గడువు బుధవారం సాయంత్రంతో ముగిసింది. ఈ నెల 12వ తేదీ నుంచి ర్యాంకర్లు వెబ్ ఆప్షన్లు నమోదు చేశారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రాల్లో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. వెబ్ ఆప్షన్ల నమోదులో విద్యార్థులకు సహకరించారు. ఈ నెల 23న సీట్లు కేటాయిస్తారు. అదే రోజు నుంచి 31వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టు చేయాలి. సీటు కేటాయింపు నిర్ధారణ లెటర్, సెల్ఫ్ రిపోర్టులను డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత కాలేజీకి అందించాలని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు సూచించారు. రెండో విడత కౌన్సెలింగ్‌కు వెళ్లాలనుకునే వారు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, సర్టిఫికెట్లు ఇవ్వాల్సిన పని లేదని స్పష్టం చేశారు.

# గ్రేహౌండ్స్ కమాండెంట్ సీతారాంకు పీపీఎం అవార్డు



సీఎం జగన్ చేతుల మీదుగా పీపీఎం అవార్డును తీసుకుంటున్న గ్రేహౌండ్స్ కమాండెంట్ సీతారాం

**దొండపర్తి:** గ్రేహౌండ్స్ కమాండెంట్ పి.సీతారాంకు ప్రతిష్టాత్మక ప్రెసిడెంట్ పోలీస్ మెడల్(పీపీఎం) లభించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా స్వాతంత్ర్య దినోత్సవం రోజున స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన సీతారాం 1991లో రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యారు. 1998లో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా, 2007లో అసిస్టెంట్ కమాండెంట్‌గా, 2019లో కమాండెంట్‌గా పదోన్నతి పొందారు. 32 ఏళ్ల అత్యుత్తమ సర్వీస్‌కు గాను సీతారాం ప్రతిష్టాత్మక పీపీఎం అవార్డును దక్కించుకున్నారు. ఆయన ఇప్పటికే 2004లో పోలీస్ మెడల్ ఫర్ గ్యాలెంటరీ, 2014లో ఇండియన్ పోలీస్ మెడల్‌ను, అలాగే రాష్ట్ర అవార్డులైన సేవా, ఉత్తమ సేవా, మహోన్నత సేవా, ఇతర మెడల్స్‌ను చేజిక్కించుకున్నారు.

# ఎలక్ట్రికల్ లోకో షెడ్‌లో డీఆర్ఎం తనిఖీలు

**తాటిచెట్లపాలెం:** వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ బుధవారం ఎలక్ట్రికల్ లోకో షెడ్‌లో తనిఖీలు చేశారు. షెడ్‌లో గల పిట్‌వీల్ లేత్, ఎలక్ట్రానిక్ లేబ్, స్టోర్స్ గోడౌన్ వంటి ప్రాంతాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో సిబ్బందితో ఆయన మాట్లాడారు. షెడ్ సిబ్బంది అక్కడ జరుగుతున్న వివిధ పనులపై ఆయనకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు సీనియర్ అధికారులు, ఎలక్ట్రికల్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# 18న దివ్యాంగులకు ప్రత్యేక జాబ్‌మేళా

**కంచరపాలెం:** జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18న దివ్యాంగులకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) ఓ ప్రకటనలో తెలిపారు. ఫైజర్ ఇండియా, ఏసియన్ పెయింట్స్, ఇండిగో ఎయిర్‌లైన్, వింధ్య ఇన్ఫో మీడియా, సెంట్రల్ ఫార్మసీ, బీపీసీఎల్, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్, మాక్స్ ఫ్యాషన్, ఫ్లిప్‌కార్ట్, రిలయన్స్ ట్రెండ్స్ తదితర కంపెనీల్లో 475 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. జూనియర్ కెమిస్ట్, ఫార్మాసిస్ట్, ట్రైనీ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ అండ్ ఫీల్డ్ ట్రైనీ, సేల్స్ డెవలప్‌మెంట్ మేనేజర్, కస్టమర్ సర్వీస్ ఆఫీసర్, క్యాషియర్, ఆయిల్ ఫిల్లింగ్ ఆపరేటర్, సెక్యూరిటీ గార్డ్స్, బ్రాంచ్ గొడౌన్ ఇన్‌చార్జి, కంప్యూటర్ ఆపరేటర్ తదితర ఉద్యోగాలకు 9వ తరగతి, 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్, ఐటీఐ, బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన 18–35 ఏళ్ల వయసున్న అభ్యర్థులు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు https://www.ncs.gov.in/లో పేర్లు నమోదు చేసుకుని.. ఆ రోజు 10 గంటల నుంచి జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు.

# కొల్లాబత్తులకు ఘన నివాళి



కొల్లా బత్తుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

**కంచరపాలెం:** వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ కొల్లాబత్తుల వెంగళరావు సంస్మరణ సభ బుధవారం 104 ఏరియా బాపూజీనగర్‌లో జరిగింది. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు చల్లా రజిని పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొల్లాబత్తుల కుటుంబానికి వైఎస్సార్ సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్ రాజు, వి.ప్రసాద్, వార్డు అధ్యక్షుడు చల్లా ఈశ్వరరావు, పీలా వెంకటలక్ష్మి, పి.సునీత, కర్రి రామారెడ్డి, పి.సునీత, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'ఉచిత న్యాయం ప్రజల హక్కు'

**విశాఖ లీగల్:** ఉచిత న్యాయ సహాయం పొందడం ప్రజల హక్కు అని జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ అన్నారు. నగరంలోని సీతమ్మధార ప్రాంతంలోని ఎన్‌బీఎం లా కాలేజీలో విద్యార్థులకు న్యాయ శాస్త్రంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. న్యాయ శాస్త్రంపై పూర్తి అవగాహన అవసరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.వి.రమణ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే పలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గాయత్రి, ఉచిత న్యాయ సేవా సహాయ సంస్థ ప్యానల్ న్యాయవాదికె.రవిశంకర్ పాల్గొన్నారు.

# తల్లీ పిల్లల అదృశ్యం

**మద్రిపాలెం:** ఇద్దరు పిల్లలతో తన భార్య అదృశ్యమైనట్లు ఆమె భర్త కంచరపాలెం (5వ పట్టణ) పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. కైలాసపురం శాంతినగర్‌కు చెందిన ఓ పత్రిక ఎడిటర్ కాకర చక్రవర్తి, భార్య ధనలక్ష్మి, కుమార్తె హర్షిణి జయశ్రీ, కుమారుడు సంపత్‌సాయితో నివాసం ఉంటున్నారు. ఈ నెల 14న విధులు ముగించుకుని ఇంటికి రాగా.. తాళం వేసి ఉంది. దీంతో అతను చుట్టు పక్కల వారిని సమాచారం అడిగారు. పిల్లలతో కలిసి ఆమె ఆటోలో సామాన్లు వేసుకుని వెళ్లారని చెప్పారు. వారి కోసం ఆ రోజు నుంచి ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రవికిశోర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


# డిగ్రీ కాంట్రాక్ట్ అధ్యాపకుల రెన్యూవల్

**మద్దిలపాలెం:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను 2023–24 విద్యా సంవత్సరానికి రెన్యూవల్ చేస్తూ ప్రాంతీయ విద్యా సంయుక్త సంచాలకుడు ఆదేశాలు జారీ చేసినట్లు నోడల్ ఐడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయ బాబు తెలిపారు. 2022–23 మార్చి 31వ తేదీ వరకు కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పని చేసిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఆయా డిగ్రీ కళాశాల్లో ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల్లో సమర్పించాలని సూచించారు. ఆ దరఖాస్తులను 21లోగా జిల్లా ఐడీ కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేయాలని.. జిల్లా సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 23న కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. రెన్యూవల్ అయిన కాంట్రాక్ట్ అధ్యాపకులు ఈ నెల 24న ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

# లారీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

**విశాఖ లీగల్:** లారీని అతివేగంగా నడిపి ఒకరి మృతికి కారణమైన డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ నగరంలోని ప్రధాన మెట్రోపాలిటీ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎం.పద్మావతి బుధవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా రెండు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. మరో వ్యక్తిని గాయపరిచినందుకు రూ.500 జరిమానా చెల్లించాలని కూడా ఆ తీర్పులో స్పష్టం చేశారు. సీనియర్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపిల్లి ఆదినారాయణ తెలిపిన వివరాలివీ.. నిందితుడు వికాస్ కుమార్ రానాది జార్ఖండ్. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 2020 డిసెంబర్ 12న జగదాంబ నుంచి గాజువాక వైపు స్కూటీపై వెళుతున్న సీహెచ్ ఆనందరావును లారీతో బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఆనందరావు కొడుకు జైకుమార్‌కు, ఎదురుగా వస్తున్న రవీంద్ర వర్మకు గాయాలయ్యాయి. హార్బర్ పోలీసులు నిందితుడిపై ఐపీసీ 304, 337, 279 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అప్పటి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వై.మురళీరావు నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు నిచ్చారు.

# వైభవంగా అష్టలక్ష్మి కల్యాణం



శ్రీలలితాపీఠంలో అష్టలక్ష్మి అమ్మవార్లకు కల్యాణం

**సీతంపేట:** శ్రీలలితా పీఠంలో అష్టలక్ష్మి సమేత నారాయణ కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. లలితాపీఠంలో ఐదు రోజులుగా జరుగుతున్న అష్ట పద్మ కుండాత్మక అష్టలక్ష్మి మహాయాగం ముగింపు సందర్భంగా బుధవారం ఉదయం పూర్ణాహుతి, సాయంత్రం అష్టలక్ష్మి కల్యాణం వైభవంగా జరిగింది. చాతుర్మాస దీక్షలో ఉన్న లలితాపీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పర్యవేక్షణలో రుత్వికుల వేదమంత్రాల మధ్య అష్టలక్ష్మి అమ్మవార్లకు ఏకకాలంలో శ్రీమన్నారాయణులతో కల్యాణం శాస్త్రోక్తకంగా జరిపించారు. పీఠం దర్బార్ హాల్లో కల్యాణ వేదికపై సర్వాంగ సుందరంగా అలంకరించి స్థాపన చేసిన అష్టలక్ష్మి రూపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కుర్తాళ పీఠ ఆస్థాన పండితులు మాచవోలు రమేష్‌శర్మ సారథ్యంలో అమ్మవార్ల కల్యాణంలోని ముఖ్య ఘట్టాలు సుముహూర్తం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలు కళ్లకు కట్టినట్టు చూపారు. అష్టలక్ష్మి అమ్మవార్లకు ఏకకాలంలో నారాయణుడితో కల్యాణం, అధిక శ్రావణం, లలితాదేవి అమ్మవారి సన్నిధిలో జరగడం దేశంలోనే తొలిసారి అన్నారు. ఈ కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతిస్వామిని, పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ పాల్గొన్నారు.

# సాకేతపురంలో విషాదం

**గోపాలపట్నం:** శ్రీకాకుళం జిల్లా నాగావళిలో మునిగి ఇద్దరు చిన్నారులు మృతి చెందడంతో ఎన్ఏడీ సమీపంలోని సాకేతపురంలో విషాదం నెలకొంది. స్థానికంగా నివసిస్తున్న కోన ఆనంద్, జ్యోతి దంపతులకు ఇద్దరు కుమారులు కోన కార్తికేయ (11), కోన గణేష్ గౌతమ్ (7). శ్రీకాకుళంలోని బంధువుల ఇంటికి వెళ్లిన వీరు బుధవారం ఉదయం నాగావళిలో స్నానానికి దిగి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి మృతిచెందారు. ఈ దుర్ఘటనతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సాకేతపురంలోని ఆనంద్ బంధువులు, స్నేహితులు విషాదంలో మునిగిపోయారు.

# బాల్య వివాహాలు చట్ట విరుద్ధం



పోస్టర్ విడుదల చేస్తున్న జేసీ విశ్వనాథన్

**మహారాణిపేట:** బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని తెలియజేస్తూ.. రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మాసోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం జేసీ కె.ఎస్.విశ్వనాథన్ ఆవిష్కరించారు. జిల్లా మహిళా, శిశు అభివృద్ధి, సాధికారిక అధికారి డి.వెంకటేశ్వరి, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ఎం.ఆర్.ఎల్.రాధ, సభ్యులు ఎం.రజని, జిల్లా బాలల పరిరక్షణ విభాగం పరిరక్షణ అధికారి ఐ.అనిజ, ఏయూ మనో విజ్ఞాన శాస్త్రం విభాగ ఆచార్యుడు రాజు, జిల్లా అధికారి ఎం.శరత్ బాబు, ప్రభుత్వ మానసిక ఆస్పత్రి వైద్యురాలు ప్రజ్ఞామిత్ర పాల్గొన్నారు.